క్లుప్తంగా

నేడు, రేపు పీవో, ఏపీవోలకు శిక్షణ



స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న ఆర్వో వెంకటరావు తదితరులు

కాకినాడ సిటీ: ఎన్నికల విధుల్లో ఉండే ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు శుక్ర, శనివారాల్లో రెండు రోజుల పాటు శిక్షణ ఇస్తున్నట్లు సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు తెలిపారు. కాకినాడ పీఆర్ ప్రభుత్వ కళాశాల ఆవరణలో ఈ శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం ఎనిమిది వందల మందికి ఇచ్చే శిక్షణలో రోజుకు 400 మంది పీవో, ఏపీవోలు పాల్గొననున్నట్లు తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు. పోలింగ్ రోజు, పోలింగ్ ముందు రోజు విధులు, ఈవీఎం, వీవీ ప్యాట్ల పనితీరు తదితర అంశాలపై ఈ శిక్షణ జరుగుతుందని ఆర్వో వెంకటరావు తెలిపారు. ఎంపిక చేసిన మాస్టర్ ట్రైనర్లు వీరికి శిక్షణ ఇస్తారన్నారు. ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఇటువంటి శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. శిక్షణను సద్వినియోగం చేసుకుని ఎన్నికలు సజావుగా నిర్వహించడంలో శ్రద్ధ వహించాలని ఆర్వో ఆదేశించారు.

స్ట్రాంగ్ రూమ్ పరిశీలన

మెక్లారిన్ హైస్కూల్ గ్రౌండ్‌లోని స్ట్రాంగ్ రూమ్‌ను రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు గురువారం సాయంత్రం సందర్శించారు. డీఎస్పీ హనుమంతరావు, ఇతర ఎన్నికల అధికారులతో కలసి అక్కడ కల్పించాల్సిన భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్వో వెంట డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్, తహసీల్దార్ చల్లన్నదొర, ఏఈ రమేష్, సర్వేయర్ ఆచారి తదతరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వసంత నవరాత్ర పూజలు



సామర్లకోట పంచారామ క్షేత్రంలోని స్వామి వారు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రం బాలాత్రిపుర సుందరి సమేత కుమారా రామభీమేశ్వర ఆలయంలో గురువారం వసంత నవ రాత్ర పూజలు వైభవంగా నిర్వహించారు. ఉగాది సందర్భంగా ప్రారంభించిన విషయం విధితమే. దీనిలో భాగంగా ఈఓ భళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ పండితులు వేమూరి సోమేశ్వర శర్మ, సన్నిధిరాజు వెంకన్న, చెరుకూరి రాంబాబు, శ్రీకాకుళపు సత్యనారాయణమూర్తి, వినయ్ ఉదయం విఘ్నేశ్వర పూజ, మహన్యాసం, కుమారా రామభీమేశ్వర స్వామి వారికి ఏకాదశ రుద్రాభిషేకాలు చేశారు. సాయంత్రం బాలాత్రిపుర సుందరి దేవికి నవావరణార్చన, నీరాజన మంత్రపుష్పాలు, కుంకుమార్చన, దర్బారు సేవ, వేద స్వస్తి నిర్వహించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు చేశారు. ఈనెల 17వ తేదీ వరకు ఆలయంలో వసంత నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తారు.

అందరికీ మంచి జరగాలి

- ఎమ్మెల్యేలు కన్నబాబు, చంద్రశేఖరరెడ్డి
- భక్తి ప్రపత్తులతో రంజాన్ ప్రార్థనలు
- భారీగా హాజరైన ముస్లింలు



రంజాన్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యేలు చంద్రశేఖరరెడ్డి, కన్నబాబు

కాకినాడ సిటీ: నెల రోజుల ఉపవాస దీక్ష అనంతరం రంజాన్ వేడుకలను గురువారం అత్యంత భక్తిప్రపత్తులతో జరుపుకొన్నారు. కాకినాడ ఈద్గా మైదానానికి పరిసర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున ముస్లింలు హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కాకినాడ పెద్ద మసీదు ఇమామ్ అబ్దుల్ రిజ్వాన్ రిజ్వి అక్కడకు హాజరైన ముస్లింలతో ప్రార్థనలు చేయించారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డితో పాటు పలువురు ముస్లిం పెద్దలు హాజరయ్యారు. వారు ముస్లింలను ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ చెప్పారు. అనంతరం పేదలకు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ దాతృత్వం, భక్తిభావంతో నెల రోజుల కఠోర ఉపవాస దీక్ష చేసిన ముస్లింలకు అల్లా కరుణా కటాక్షాలు లభించాలని ఆకాంక్షించారు. సర్వమత సమానత్వానికి కరుణ, దాతృత్వాలకు ప్రతీకగా నిలిచే రంజాన్ పండుగ సందర్భంగా ముస్లింలు అందరికీ మంచి జరగాలని, అన్ని విధాలా అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో ముస్లిం ప్రతినిధులు అబ్దుల్ బషీరుద్దీన్, లతీఫ్‌ఖాన్, ఎండీ బాషా, ఇజాజుద్దీన్ రెహమాన్‌ఖాన్, ఇక్బాల్ ఆలీ, ఆలీషా, కరీం బాషా తదితరులు పాల్గొన్నారు. కాగా కాకినాడ నగరంలోని అన్ని మసీదులు, ఆనందభారతి మైదానంలో రంజాన్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

మత సామరస్యానికి ప్రతీక రంజాన్

బోట్‌క్లబ్: జాతీయ సమగ్రతకు, సాంస్కృతిక వికాసానికీ దోహదమయ్యే పండగల్లో మానవాళికి హితాన్ని బోధించే సందేశం ఉంటుందని పార సంక్షేమ సంఘం కన్వీనర్, సామాజికవేత్త దూసర్లపూడి రమణరాజు పేర్కొన్నారు. ముస్లింలు రంజాన్, క్రైస్తవులు క్రిస్మస్, హిందువులు నవరాత్రులు ఇలా నిర్వహించే కార్యక్రమాల్లో క్రమశిక్షణ దాతృత్వం, ధార్మిక చింతన ఉంటాయన్నారు. రంజాన్ సందర్భంగా గురువారం ఈద్గా మైదానంలో జరిగిన వేడుకల్లో రమణరాజు ముస్లింలతో కలసి ప్రార్థన చేసి అనంతరం వారికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జామా మసీదు ఇమామ్ అబ్దుల్ రజాక్‌కు పుష్పగుచ్ఛం అందించి సంఘీభావం తెలిపారు. రజాక్ మాట్లాడుతూ ఇదే రీతిగా హిందువుల ఆదరాభిమానాలు ఎల్లకాలం కొనసాగాలని అల్లాహ్‌ను వేడుకున్నట్లు తెలిపారు.



ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు

మతోన్మాద బీజేపీని ఓడించడమే లక్ష్యం

కాకినాడ సిటీ: స్థానిక సుందరయ్య భవన్‌లో సీపీఎం జిల్లాస్థాయి విస్తృత సమావేశం గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏవీ నాగేశ్వరరావు మాట్లాడుతూ బీజేపీని అధికారంలోకి రాకుండా చూడడం, మార్క్సిస్టుల బలాన్ని పార్లమెంటులో పెంచుకోవడమే లక్ష్యంగా పార్టీ పనిచేస్తున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో కూటమిని ఓడించడమే ప్రధాన ధ్యేయంగా పని చేస్తామని పార్టీ నాయకులు స్పష్టం చేశారు. తక్షణమే పార్టీ యూనిట్లను సమావేశ పరిచి, లక్ష్యాలను గ్రామస్థాయిలో తీసుకెళ్లడానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జ్యోతిరావ్ పూలే, సావిత్రిబాయి పూలే చిత్రపటాలకు నివాళులర్పించారు. సీపీఎం నాయకులు ఎం.రాజశేఖర్, మోర్త రాజశేఖర్, కెఎస్ శ్రీనివాస్, దువ్వా శేషబాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

కరప: తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు 17 ఏళ్ల బాలిక అదృశ్యంపై పోలీసులు కేసునమోదు చేశారు. ఎస్‌ఐ టి.రామకృష్ణ తెలిపిన కథనం మేరకు ఉప్పలంక గ్రామానికి చెందిన బాలిక బుధవారం రాత్రి తల్లిదండ్రులతో కలసి తమ గృహంలో నిద్రించింది. గురువారం ఉదయం తల్లి లేచేసరికి పక్కన కుమార్తె కనిపించలేదు. తల్లిదండ్రులు ఆమె కోసం ఉప్పలంక, పరిసర గ్రామాల్లో, బంధువులు, స్నేహితుల ఇళ్లల్లోను ఆరా తీసినా ఆచూకీ కనిపించలేదు. దీంతో గురువారం రాత్రి పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఎస్‌ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మరింత అభివృద్ధికి జగన్‌ను సీఎం చేద్దాం



చీడిగలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- చీడిగలో హోరెత్తిన ఎన్నికల ప్రచారం

కాకినాడ రూరల్: మండలంలోని చీడిగ గ్రామంలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కురసాల కన్నబాబు గురువారం తన ఎన్నికల ప్రచారాన్ని హోరెత్తించారు. గ్రామంలో కనక దుర్గ ఆలయంలో ప్రత్యేక పూజలు అనంతరం ప్రచార వాహనంపై పర్యటించారు. గ్రామస్తులు అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు. ప్రధాన వీధుల్లో కన్నబాబు ప్రచారం చేపట్టగా పెద్ద ఎత్తున మహిళలు హాజరయ్యే జై జగన్, జై కన్నబాబు, జై సునీల్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ నియోజకవర్గం నుంచి వైఎస్సార్ సీపీ తరఫున తాను ఎమ్మెల్యే అభ్యర్థిగా, కాకినాడ పార్లమెంట్‌కు చలమలశెట్టి సునీల్ పోటీ చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత పేద ప్రజల పరిస్థితి మెరుగైందన్నారు. సంక్షేమ పథకాలు ప్రతి కుటుంబానికి అండగా నిలిచాయన్నారు. పెద్ద ఎత్తున ఇళ్ల స్థలాలు ఇచ్చి, ఇంటి రుణాలు మంజూరు చేశామన్నారు. పాఠశాలలు మెరుగయ్యాయని, సంక్షేమంతో పాటు అభివృద్ధి పెద్ద ఎత్తున జరిగిందన్నారు. చీడిగలో రోడ్లు, డ్రైనేజీలు, పలు భవనాలు నిర్మించామన్నారు. వచ్చే ఎన్నికల్లో పేదల పక్షపాతిగా జగన్ మీ ముందుకు వస్తున్నారన్నారు. మంచి చేసిన నేతను ఆశీర్వదించాలని తమను గెలిపించేందుకు ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలన్నారు. మళ్లీ సంక్షేమ ప్రభుత్వానికి అవకాశం ఇవ్వాలన్నారు. చంద్రబాబు, పవన్ ఎన్నికల కోసం రకరకాలు హామీలతో మభ్య పెట్టాలని చూస్తున్నారని, వాటిని నమ్మవద్దన్నారు. గతంలో చంద్రబాబు ఇచ్చిన హామీలు ఏవీ నెరవేర్చలేదన్నారు. కార్యక్రమంలో చీడిగ గ్రామ నాయకుడు కొప్పిశెట్టి గణేష్, జెడ్పీటీసీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

కొత్తపల్లి: ఎన్నికల సమయంలో ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని ఎస్సై స్వామినాయుడు అన్నారు. మండలంలోని కోండెవరం శివారు శొంఠవారిపాకలో ఎన్నికలపై గురువారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జరగనున్న స్థానిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా పోలీసులకు సహకరించాలన్నారు. ఎవరిపైనైనా కేసు నమోదయితే జీవితాంతం పోలీసుల ఎదుట హాజరై తహసీల్దారు కోర్టులో తాను తగాదాలకు దిగనని హామీఇవ్వాల్సి ఉంటుందని అన్నారు. ఎన్నికల్లో మద్యం, సొమ్ముతో ఓటర్లను అభ్యర్థులు మభ్యపెట్టకుండా ప్రభుత్వం నిఘా పెట్టిందన్నారు. ఈ ఎన్నికల సమయంలో ఎటువంటి ఘర్షణలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా మద్యం దుకాణాలను మూసివేయాలన్నారు. వివాదాస్పద పోలింగ్ కేంద్రాలపై నిఘా కొనసాగుతుందన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

కిర్లంపూడి: అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి, 6ఏ క్రిమినల్ కేసు నమోదు చేసినట్టు ఎంఎస్ఓ పి.విజయకుమారి తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం..పెద్దాపురం మండలం గోరింట గ్రామానికి చెందిన గంటా సాయిబాబు అక్రమంగా కనుగోలు చేసిన రేషన్ బియ్యాన్ని జగపతినగరం కొత్తపేటలో నిల్వ ఉంచుకునేవాడు. బుధవారం రాత్రి సుమారు 26 క్వింటాళ్ల 10 కేజీలు రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా పలువురు స్థానికులు పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. పోలీసులు ఇచ్చిన సమాచారంతో గురువారం వ్యాన్‌ను అదుపులోకి తీసుకుని దివిలిలోని పీడీఎస్ ఎంఎల్ఎస్ కేంద్రానికి తరలించారు. నిందుతుడిపై 6ఏ కేసు నమోదు కిర్లంపూడి పోలీస్ స్టేషన్‌కు అప్పగించినట్టు ఆమె తెలిపారు. ఏఎస్సై కుమార్ ఉన్నారు.

నేడు నూకాలమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ

గండేపల్లి: ఉప్పలపాడులో నూతనంగా నిర్మించిన ఆలయంలో శుక్రవారం నూకాలమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ చేయనున్నట్టు ఆలయ ధర్మకర్త, గ్రామ సొసైటీ అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ నాయకులు పాము సూరిబాబు తెలిపారు. ఉదయం చండీ హోమం, అనంతరం విగ్రహ ప్రతిష్ఠ, మధ్యాహ్నాం అన్న సమారాధన, సాయంత్రం వివిధ వేషధారణలు, బాణసంచా కాల్పులతో అమ్మవారికి జాతర, కోలాటం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి జగ్గంపేట అసెంబ్లీ అభ్యర్థి తోట నరసింహం, కాకినాడ పార్లమెంట్ సభ్యులు చలమలశెట్టి సునిల్, యువనాయకులు తోట రాంజీ తదితరులు పాల్గొంటారన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరికలు



గొర్రిపూడి టీడీపీ కార్యకర్తలకు వైఎస్సార్‌సీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు



అరట్లకట్టలో శేషారావుకు పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- టీడీపీ నుంచి పలువురి చేరిక

కాకినాడ రూరల్: కరప మండలం గొర్రిపూడి టీడీపీ కార్యకర్తలు గండి రాంప్రసాద్, లోవరాజు, తదితరులు ఎమ్మెల్యే కురసాల కన్నబాబు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. రమణయ్యపేట క్యాంపు కార్యాలయం వద్ద గొర్రిపూడి చీకాల అప్పలరాజు ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ కార్యకర్తలకు పార్టీ కండువాలు వేసి వైఎస్సార్‌సీపీలో కన్నబాబు ఆహ్వానించారు.

వైఎస్సార్ సీపీతోనే ప్రజాభ్యున్నతి

కరప: ప్రజాభ్యున్నతే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నవరత్న పథకాలతో పాటు మరెన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశారని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం రాత్రి అరట్లకట్టలో పార్టీ శ్రేణులతో కలసి ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తనను, ఎంపీ అభ్యర్థిగా చలమలశెట్టి సునీల్‌ను గెలిపించి జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని ఓటర్లను కోరారు. వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సోడగం సూరిబాబు తదితర గ్రామస్తులతో కలసి అరట్లకట్టలో ప్రచారంలో ఉండగా కమ్మ సామాజిక వర్గీయులు, టీడీపీ సీనియర్ నాయకులు తమ ఇళ్లలోకి ఆహ్వానించి వైఎస్సార్ సీపీలో చేరేందుకు ముందుకు రాగా వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. టీడీపీకి చెందిన ఎండ్రు శేషారావు, ఎండ్రు శిరీష, సేవా శివాజీ, పెనుమర్తి పట్టాభిరామయ్య, అప్పసాని గోవిందరాజులు, ముమ్మారెడ్డి రాంబాబు, ముమ్మారెడ్డి వీరబాబు తదితర 50 కుటుంబాల వారు పార్టీలో చేరారు. చాలా కాలంగా టీడీపీలో పార్టీ కోసం పనిచేశామని, చంద్రబాబు నాయుడు ప్రజలు, పేదల కోసం కాకుండా అధికారం కోసమే జనసేన, బీజేపీలతో పొత్తుపెట్టుకోవడం, అప్రజాస్వామికంగా విమర్శలు చేయడం నచ్చక ఈ పార్టీలో చేరుతున్నట్టు తెలిపారు. సీఎం జగన్, ఎమ్మెల్యే కన్నబాబు పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడం, వేలాది మందికి ఇళ్ల స్థలాలు ఇవ్వడం, రూ.44 కోట్లతో గ్రామాభివృద్ధి, సంక్షేమం ద్వారా ప్రజలకు లబ్ధి తదితర కార్యక్రమాలకు ఆకర్షితులమై ఈ పార్టీలో చేరామని, తమ బంధువర్గంతో కలసి ఎన్నికల ప్రచారం చేసి, వైఎస్సార్ సీపీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేస్తామని శేషారావు తదితరులు ప్రకటించారు. ఎమ్మెల్యే కన్నబాబు మాట్లాడుతూ గ్రామంలో అందరినీ సమన్వయం చేసుకుని, వైఎస్సార్ సీపీ కుటుంబ సభ్యులందరూ ఐకమత్యంగా పార్టీ గెలుపునకు పనిచేయాలన్నారు. ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, మండల పార్టీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ క్యాడర్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ భానుమతి తదితరులు

తాళ్లరేవు: మండలంలోని పి.మల్లవరం పంచాయతీ రాంజీనగర్‌లో అంబేడ్కర్ విగ్రహాన్ని వైద్యురాలు డా.భానుమతి గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో అమలాపురం ఎంపీ చింతా అనూరాధ, ఎంపీపీ రాయుడు సునీత, ముమ్మిడివరం ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, మాజీ జెడ్పీ చైర్మన్ దున్నా జనార్థనరావు తదితరులు హాజరై మాట్లాడారు. పేద, బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం తన జీవితాన్ని ధారబోసిన మహోన్నత వ్యక్తి అంబేడ్కర్ అని కొనియాడారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ధూళిపూడి నాగేంద్రప్రసాద్, భూపతిరాజు బుల్లిరాజు, రాయుడు గంగాధర్, మట్టపర్తి లోవరాజు, ముద్దన వెంకట శివరామ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త ఓట్ల కోసం దరఖాస్తు చేసుకోండి

పిఠాపురం: వచ్చే నెల 13వ తేదీన జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ఓటు హక్కు లేని వారు ఈనెల 14వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవచ్చని పిఠాపురం ఆర్‌ఓ రామసుందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకునే వారు ఫారం-6ను పూర్తి చేసి సంబంధిత తహసీల్దారు కార్యాలయాల్లో అందజేయాలన్నారు. హోమ్ ఓటింగ్ సదుపాయం ద్వారా ఓటు వేసే వారు 85 ఏళ్లు నిండిన వారు శారీరక అంగవైకల్యం ఉన్న వారు ఈనెల 22వ తేదీ లోపు ఫారం-12డీని పూర్తి చేసి సంబంధిత బీఎల్‌ఓలకు అందజేయాలని ఆయన కోరారు.

చంటి పిల్లలా..కంటికి రెప్పలా..!



మాతా శిశువులను ఇంటికి క్షేమంగా చేర్చే తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్

- పురిటి నొప్పులు తెలియకుండా ప్రభుత్వ వైద్య సేవలు
- మాతాశిశు సంక్షేమానికి ప్రభుత్వ పథకాల అమలు

పిఠాపురం: మాతా శిశు సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది అనడానికి ఈ చిత్రాలే సాక్ష్యం. మాతృత్వం కోసం ప్రతి స్త్రీ పరితపిస్తుంది. ఒక బిడ్డకు జన్మనివ్వాలంటే ఆమెకు పునర్జన్మతో సమానం. సరైన వైద్యం అందక ఎంతో మంది తల్లులు బిడ్డలను కోల్పోయారు. తల్లులు కన్నుమూసిన సందర్భాలూ ఉన్నాయి. అయితే అలాంటి పరిస్థితులు రాకుండా ప్రభుత్వం వివిధ పథకాల అమలు చేసింది. మహిళ గర్భం దాల్చిన నాటి నుంచి బిడ్డ పుట్టే వరకు రక్షణ కల్పించింది. తల్లీ బిడ్డల వైద్య సేవలు విస్తృతం చేసింది. గర్భం దాల్చిన నాటి నుంచి పౌష్టికాహారం మందులు అందించడం ద్వారా పండంటి బిడ్డకు జన్మనిచ్చేలా వైద్య సిబ్బంది తీసుకుంటున్న చొరవ, సేవలు ఎందరో తల్లి బిడ్డలకు ప్రాణ దానం చేస్తున్నాయి. కటిక పేదవారి నుంచి ధనవంతుల వరకు ఇప్పుడు ప్రభుత్వాసుపత్రిలోనే పురుడు పోసుకునేంతగా ప్రభుత్వ వైద్యశాలల్లో ప్రసూతి వైద్య సేవలు ఆదరణ పొందాయి. ఇదంతా వైద్య రంగంలో ప్రభుత్వం తీసుకున్న విప్లవాత్మక మార్పులు వల్లే సాధ్యమైంది.



గర్భం దాల్చిన వెంటనే వైద్య పరీక్షలు



పుట్టిన వెంటనే చంటి పిల్లలకు వైద్య సేవలు



పిల్ల సంరక్షణపై బాలింతలకు సూచనలు

ఘనంగా జ్యోతిరావ్ పూలే జయంతి

కాకినాడ సిటీ: దళిత, గిరిజన, బీసీ, ముస్లిం, క్రైస్తవ ఐక్యవేదిక ఆధ్వర్యంలో గురువారం మహాత్మా జ్యోతిరావ్ పూలే జయంతిని జగన్నాథపురం అన్నమ్మఘాటీ సెంటర్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాల వద్ద నిర్వహించారు. ముందుగా ఐక్యవేదిక నాయకులు ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. సత్యశోధన సమాజ్‌ను స్థాపించి అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహోన్నతుడు పూలే అని అన్నారు. ఐక్యవేదిక నాయకులు డోకుబుర్ర భద్రం, సుధాకర్, ఆవుపాటి ఉమాశంకర్, సిద్ధాంతపు రాజు, కొండేపూడి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాటసారులకు మిఠాయిలు పంచారు.

పూలే ఆశయ సాధనకు కృషి చేయాలి

కరప: సామాజిక అసమానతలు రూపుమాపేందుకు మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయసాధనకు అందరూ కృషిచేయాలని ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు అన్నారు. కరపలో స్థానిక పీహెచ్‌సీ ఎదురుగా గురువారం వైఎస్సార్ సీపీ యూత్ అధ్యక్షుడు పెంకే సత్తిబాబు నిర్మించిన మహాత్మ జ్యోతీరావు పూలే విగ్రహానికి గురువారం వారు నివాళులర్పించారు. వైస్ఎంపీపీ పాట్నీడి భీమేశ్వరరావు, కరప, గొడ్డటిపాలెం, వేములవాడ, వలసపాకల సర్పంచ్‌లు సాదే ఆశాజ్యోతి, వాసంశెట్టి శ్రీనుబాబు, కమిడి మంగాదేవి, వాసంశెట్టి రామారావు, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు రొక్కాల గణేష్, పీఏసీఎస్ చైర్మన్ నక్కా వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

బలహీన వర్గాల ఆశాజ్యోతి పూలే

బోట్‌క్లబ్: బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి జ్యోతిరావు పూలే అని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రామరాఘవ అన్నారు. జిల్లా బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సంఘసంస్కర్త, విద్యావేత్త, బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు గురువారం నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి సెంటర్‌ని పూలే కాంస్య విగ్రహానికి పూలమాలలు వేశారు. రాష్ట్ర నాయకులు అద్దంకి వెంకన్న బాబు, జిల్లా అధ్యక్షుడు రామానుజం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి గంటి రాధాకృష్ణ, ఆర్థిక కార్యదర్శి వాసంశెట్టి కామేశ్వరరావు, కాకినాడ టౌన్ అధ్యక్షుడు చోడే శ్రీనివాస్ పాల్గొన్నారు.



జ్యోతిరావ్ పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఐక్యవేదిక ప్రతినిధులు

బీసీ కులాల ఐక్య వేదిక, జేఏసీ ఆధ్వర్యంలో..

కాకినాడ సిటీ: బీసీ జేఏసీ, 93 బీసీ కులాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో గురువారం కాకినాడ మహిళా పాలిటెక్నిక్ వద్ద మహాత్మా జ్యోతిరావ్ పూలే విగ్రహానికి నివాళులు అర్పించారు. బీసీ నాయకులు మాకిరెడ్డి భాస్కర్ గణేష్‌బాబు, చొల్లంగి వేణుగోపాల్, ఏవీడీ మెంటారావు, చొల్లంగి వీరబాబు,మల్లాడి రాజు తదితరులు పూలే విగ్రహానికి నివాళులర్పించారు.



కరపలో జ్యోతిరావు పూలేకు నివాళులర్పిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ తదితరులు



రమణయ్యపేట ఏపీఐఐసీ కార్యాలయంలో పూలే చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న జోనల్ మేనేజరు రమణారెడ్డి

గొప్ప సంస్కర్త జ్యోతిరావు పూలే

ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: దేశం గర్వించదగిన గొప్ప సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. రమణయ్యపేట క్యాంపు కార్యాలయంలో గురువారం పూలే జయంతిని నిర్వహించి నివాళులర్పించారు. కార్యక్రమంలో కురసాల సత్యనారాయణ, జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, గోపుశెట్టి బాబ్జీ, అనుసూరి ప్రభాకర్, రాయుడు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఏపీఐఐసీ కార్యాలయంలో..

రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. పూలే చిత్రపటానికి ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ ఎ.రమణారెడ్డి, సిబ్బంది నివాళులర్పించారు.



పూలేకు నివాళులు అర్పిస్తున్న బీసీ నాయకులు



పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న జిల్లా బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘ నాయకులు